క్లుప్తంగా

తెలుగు భాష ఖ్యాతిని చాటాలి

ఒంగోలు మెట్రో: కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక నారాయణ పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలుగుతల్లి, గిడుగు రామ్మూర్తి చిత్రపటాలను పూలమాలతో అలంకరించారు. సంస్థ అధ్యక్షుడు డా.నూనె అంకమ్మరావు సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘ అధ్యక్షురాలు తేళ్ల అరుణ, శ్రీకృష్ణదేవరాయసాహిత్య సాంస్కృతిక సేవాసమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాదుబాబు, మిడసల మల్లికార్జునరావు, యూవీ రత్నం, పిన్ని వెంకటేశ్వర్లు, బీరం అరుణ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

కమిషనర్ స్పందనకు 21 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 21 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ టిడ్కో ఇళ్లకు సంబంధించి 16 అర్జీలు వచ్చాయన్నారు. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి 2, రెవెన్యూ విభాగానికి సంబంధించి ఒకటి, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి ఒకటి, శానిటేషన్ విభాగానికి సంబంధించి మరొక అర్జీ వచ్చినట్లు వివరించారు.

శభాష్ రఘురాం



బ్యాంకు మేనేజర్‌కు డబ్బు అందజేస్తున్న రఘురాం

ఒంగోలు టౌన్: ఏటీఎంలో మరిచిపోయి వెళ్లిన డబ్బును బ్యాంకు అధికారులకు అప్పగించిన రఘురాంను శభాష్ అంటూ పలువురు అభినందించారు. సోమవారం కర్నూలు రోడ్డులోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచి ఏటీఎంలో డబ్బు డ్రా చేసేందుకు నగరానికి చెందిన సీపీఎం నాయకుడు బి.రఘురాం వెళ్లారు. అప్పటికే అక్కడ గుర్తు తెలియని వ్యక్తి ఒకరు పదివేల రూపాయలు డ్రా చేసి తీసుకోకుండా మర్చిపోయి వెళ్లిపోయారు. ఏటీఎం మిషన్లో రూ.10 వేలు ఉండటాన్ని గమనించిన రఘురాం వెంటనే ఆ డబ్బు తీసుకెళ్లి బ్యాంకు సిబ్బందికి అందించారు. డబ్బు మరచిపోయిన వ్యక్తిని గుర్తించి అప్పగించాలని కోరారు. రఘురాం నిజాయితీకి బ్యాంకు సిబ్బంది అభినందనలు తెలిపారు.


స్కూళ్లలో కులమతాల ప్రసక్తి వద్దు

ఒంగోలు టౌన్: ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలు, వసతి గృహాలు, పునరావస కేంద్రాల్లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 28కి వ్యతిరేకంగా కులమతాల ప్రస్తావనలు తెచ్చే ఉపాధ్యాయులు, సిబ్బందిపై కఠిన చర్యలు చేపట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సున్నిత మనస్కులైన విద్యార్థులకు విద్యతో పాటు నీతి, న్యాయం, నైతిక విలువలు, సేవా తత్పరతను పెంపొందించేలా ఉపాధ్యాయులు తర్ఫీదు ఇవ్వాలని హితవు పలికారు. హిందు, ముస్లిం, క్రైస్తవం, సిక్కు, జైన మతాలకు చెందిన ప్రచారాలు రాజ్యాంగానికి, విద్యా వ్యవస్థ నియమాలకు పూర్తి విరుద్ధమన్నారు. విద్యార్థుల మధ్య మత ప్రచారాలు చేయాలని చూస్తే కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పంట నమోదు అవసరం

బల్లికురవ: ప్రభుత్వం రైతులు పండించిన పంట ఉత్పత్తులు అమ్ముకునేందుకు, విపత్కర పరిస్థితుల్లో పరిహారం పొందేందుకు ఇ- పంటలో నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి కోరారు. సోమవారం కొప్పరపాలెం, వేమవరం, ఉప్పుమాగులూరులో పంటల నమోదు పరిశీలించారు.

రక్తహీనత ప్రమాదకరం



రక్తపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చినగంజాం: అనీమియా ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పరీక్షలు నిర్వహించారు. హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రమాదేవి, షకీనా, విజయలక్ష్మి, పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ బేబి, హెల్త్ సూపర్ వైజర్ చిరంజీవి, పుల్లారాణిలు పర్యవేక్షణలో 70 మంది పిల్లలకు రక్తపరీక్షలు నిర్వహించి ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. రక్త పుష్టినిచ్చే ఆకు, కాయగూరలు బాగా తీసుకోవాలని అవగాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్ మురళి, ఆశ, కార్యకర్తలు రోహిణి, విజయ, సారమ్మ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థల పట్టాలు

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- యరజర్ల వాసులు 28 మందికి పట్టాల పంపిణీ



పట్టాలు పొందిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: సొంతిళ్లు లేని ప్రతి కుటుంబానికి ఇళ్ల స్థల పట్టాలు అందజేసి ఇళ్లు కూడా నిర్మించి ఇస్తున్నట్లు ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఒంగోలు మండలంలోని యరజర్ల గ్రామస్తులు 28 మందికి సోమవారం ఒంగోలులోని తన నివాసంలో ఇళ్ల స్థల పట్టాలను బాలినేని చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ఇటీవల కొంత మందికి పట్టాలివ్వడం జరిగిందన్నారు. తాజాగా అర్హులుగా గుర్తించిన మరికొంతమందికి కూడా పట్టాలిచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. వారిలో 28 మంది అర్హులకు పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఒంగోలు మండల తహసీల్దార్ మురళి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, యరజర్ల సర్పంచ్ తమ్మిశెట్టి రాములమ్మ శ్రీనివాసులు, ఉప సర్పంచ్ హరి, మాజీ ఎంపీటీసీ జాజుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రూ.15.37 కోట్లతో మైనంపాడులో అభివృద్ధి

- ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు
- రూ.6 లక్షలతో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభం
- గడప గడపకు పోటెత్తిన గ్రామస్తులు



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో సంతనూతలపాడు మండలం మైనంపాడు రూ.15.37 కోట్ల విలువ చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు తెలిపారు. సంక్షేమ పథకాలను అమలు చేయడంలో పార్టీలకతీతంగా అన్ని పార్టీలకు చెందిన వారికి అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. సోమవారం మైనంపాడులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుకు స్థానికులు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ ఎవరూ చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో అండగా నిలబడి మళ్లీ సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. రూ.6 లక్షలతో నిర్మించిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ఈ సందర్భంగా ఎమ్మెల్యే టీజేఆర్ ప్రారంభించారు. తొలుత గ్రామంలో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను చూపిస్తూ ఏయే ఇంట్లో ఎవరెవరికి ఎన్నెన్ని సంక్షేమ పథకాలు వచ్చాయోనని అడిగి తెలుసుకున్నారు. తొలుత గ్రామంలోకి స్థానిక సర్పంచ్ దాట్ల రమణ, ఎంపీటీసీ సభ్యురాలు ఆట్లూరి రాజకుమారి, పార్టీ నాయకులు గొడుగు మస్తాన్, మాదాల నర్సయ్య, గుండవరపు సుబ్బారావు, గొడుగు కాలేషా, బస్సు మస్తాన్, పెరుగు సుబ్బారావు, ఎస్కే ఖాసిం, ఆట్లూరి సుబ్బారావు, మాదాల వెంకట్రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుకు ఘనంగా స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించి స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బి.విజయ, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, సొసైటీ ప్రెసిడెంట్ దుంపా యలమందారెడ్డి, సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి, వైస్ ఎంపీపీ టి.రాగమ్మ, జి.అయ్యన్న, పలు గ్రామాల నుంచి సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్స్యకారుల వలలో భారీ ఏనుగు టేకు చేప



ఒడ్డుకు చేర్చిన 4 క్వింటాళ్ల భారీ ఏనుగు టేకు చేప



వలకు చిక్కిన ఏనుగు టేకు చేపను ఒడ్డుకు చేర్చుతున్న మత్స్యకారులు

చీరాల టౌన్: పర్యాటక ప్రాంతంగా పేరుగాంచిన బాపట్ల జిల్లా చీరాల వాడరేవులో ఈ మధ్య కాలంలో అరుదుగా లభించే మత్స్య సంపద వలలకు చిక్కుతున్నాయి. ఐదు రోజుల క్రితం వాడరేవు మత్స్యకారుల వలకు 800 కిలోల బరువు ఉన్న పులి మచ్చల సొర చేప వలకు చిక్కగా సోమవారం 4 క్వింటాళ్ల బరువు ఉన్న భారీ ఏనుగు టేకు చేప చిక్కింది. తమ వలకు భారీగా మత్స్య సంపద చిక్కిందని ఆనందపడిన మత్స్యకారులకు కష్టం మిగిలింది....కాసులు మాత్రం పడలేదు. వివరాల్లోకెళితే మండలంలోని వాడరేవుకు చెందిన గంగిరి గోవిందు, ఐదుగురు కళాసీలు కలిసి నాలుగు రోజుల క్రితం సముద్రంలో వేటకు వెళ్లారు. ఆదివారం రాత్రికి వేట ముగించుకుని తిరిగి తీరానికి వస్తుండగా వలకు భారీగా మత్స్య సంపద చిక్కిందని ఆనంద పడ్డారు. కష్టపడి వలను బయటకు లాగి చూస్తే 9 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పుతో 4 క్వింటాళ్లకుపైగా బరువు ఉన్న ఏనుగు టేకు చేప పడింది. ఐదు రోజులుగా వేట చేస్తున్న తమకు టేకు చేప వలకు చిక్కగా సోమవారం తీరం ఒడ్డున వేలం పాట నిర్వహించగా కేవలం ఈ టేకు చేప రూ.2 వేలు పలకడంతో వేట చేసిన మత్స్యకారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. వేటకు రూ.30 వేలు ఖర్చవగా టేకు చేప వలన తమకు ఖర్చులు, కష్టాలు మిగిలాయని మత్స్యకారులు చెప్పారు.

ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తగ్గించాలి

ఒంగోలు: ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తగ్గించాలని యూటీఎఫ్ డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించిన యూటీఎఫ్ రాష్ట్ర మధ్యంతర కౌన్సిల్ సమావేశాల్లో ఆ మేరకు యూటీఎఫ్ నాయకులు తీర్మానించారు. జీవో నంబర్ 117 రద్దు చేయాలని, గతంలో 26 పీరియడ్ల నుంచి 32 పీరియడ్లు ఉండేవని, కానీ.. ఇప్పుడు 42 పీరియడ్ల నుంచి 48 పీరియడ్లు బోధించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. అదనంగా లెసన్ ప్లాన్లు, వర్క్ బుక్స్ దిద్దడం, డైరీలు, పరీక్షల మార్కులు అప్‌లోడింగ్, బైజూస్ ట్యాబ్‌ల నిర్వహణ, అనేక రకాల యాప్‌ల పేరుతో విపరీతమైన ఒత్తిడి నెలకొందన్నారు. సీపీఎస్ రద్దు కోసం పోరాడే సంఘాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. సమస్యలు పరిష్కారం కాకుంటే పోరాటం చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

30న పోలేరమ్మ, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ



హోమాలు నిర్వహిస్తున్న భక్తులు

చీమకుర్తి: మండలంలోని గాడిపర్తివారిపాలెం గ్రామంలో ఈ నెల 30వ తేదీ ఉదయం 10.50 గంటలకు పోలేరమ్మ, పోతురాజు సింహవాహన నూతన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. భక్తులకు అన్నదానంతో పాటు రాత్రి 9 గంటలకు మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నాటకం కూడా ప్రదర్శించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం విగ్రహాల జలాధివాసం, హోమాలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో అద్దంకమ్మ నగరోత్సవం



అద్దంకమ్మ తల్లికి నగరోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

చీరాల టౌన్: మండలంలోని పాత చీరాలలో కొలువై ఉన్న 11 శతాబ్దం నాటి శ్రీ అద్దంకమ్మ తల్లి నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండటంతో పాటు పాడి పంటలతో అంతా ఆనందంగా జీవించాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వార్షికోత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటుగా తప్పెట్లు, డీజే పాటలతో నగరోత్సవాన్ని చేశారు. దేవు రెడ్డమ్మ, దేవు వెంకటేశ్వరరెడ్డి, చిన్నబాబు రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాజారెడ్డి, చంద్రా డ్డి, నారాయణ డ్డి, అద్దంకి రెడ్డి, పెద్దన్న తదితరులు ఉన్నారు.

ఏఐఎం నగర అధ్యక్షునిగా ప్రసన్నకుమార్



ఏఐఎం ఒంగోలు నగర కమిటీ

ఒంగోలు: అంబేడ్కర్ ఇండియా మిషన్ (ఏఐఎం) నగర అధ్యక్షునిగా కూకట్లపల్లి ప్రసన్నకుమార్ ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక ఏఐఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నగర కమిటీని ఎన్నుకున్నారు. మన అజెండా, మన వాడ, మన పంచాయతీ, మన పాలన సాధనలో భాగంగా కమిటీని ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్షుడు కరవది అనిల్ తెలిపారు. ఏఐఎం అజెండాను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లాలని నగర కమిటీ సభ్యులకు సూచించారు.

జిల్లా కోర్టు పరిసరాల్లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు సబర్బన్: నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ వినయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఓల్డ్ రిమ్స్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్లలో మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. కొండమీద నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణంలో భాగంగా విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్లను తొలగించే కార్యక్రమం చేపట్టామన్నారు. అందులో భాగంగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిసరాలు, మున్సిపల్ కార్యాలయం రోడ్డు, కేశవస్వామిపేట, రాజాపానగల్ రోడ్డు, శ్రీగిరి కొండ మీద, మరికొన్ని ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని అన్నారు.

ఖేలో ఇండియా పోటీల్లో ఒంగోలు విద్యార్థినికి బంగారు పతకం



ఖేలో ఇండియా ఉమెన్స్ పెంకాక్ సిలాత్ పోటీలలో బంగారు పతకం కైవసం చేసుకున్న పఠాన్ ఆయేషా ఐరిష్

ఒంగోలు: ఖేలో ఇండియా ఉమెన్స్ పెంకాక్ సిలాత్ లీగ్ 2023 రాష్ట్రస్థాయి పోటీల్లో ఒంగోలుకు చెందిన పఠాన్ ఆయేషా ఐరిష్ బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఈనెల 26, 27 తేదీల్లో తిరుపతి పద్మావతి విశ్వవిద్యాలయంలో జరిగిన ఈ పోటీల్లో బంగారు పతకం అందుకున్న ఆయేషా స్థానిక నెక్స్ట్ జెన్ స్కూల్ 5వ తరగతి విద్యార్థిని, సబ్ జూనియర్ కేటగిరీలో 40–45 కేజీల విభాగంలో ఈ పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థిని తల్లిదండ్రులు కోచ్ కొమ్ము ప్రేమ్‌కుమార్‌ను అభినందించారు.

రేపటి నుంచి దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

ఇంకొల్లు (చినగంజాం): రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కొత్తగా ప్రవేశ పెట్టిన కార్డు ప్రైమ్ 2.0 ను పురస్కరించుకొని ఈ నెల 30,31 తేదీల్లో ఇంకొల్లు దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ కార్యక్రమం చేపడుతున్నట్లు దస్తావేజు లేఖర్ల రాష్ట్ర సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు తానికొండ ఎలియాజరు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, దస్తావేజు లేఖర్లు, డీటీపీ ఆపరేటర్లు, స్టాంప్ వెండర్లకు జరిగే నష్టం గురించి రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం పిలుపు మేరకు ఇంకొల్లు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు పరిధిలోని కార్డు ప్రైమ్ 2.0కు నిరసనగా పెన్ డౌన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమ్మనమంచి శ్రీనివాసరావు, బండ్ల వెంకట సుబ్బారావు, షేక్ అబ్దుల్లా, పోలూరి జగన్ మోహనరావు, వంకాయలపాటి శ్రీనివాసరావు, బాచిన శ్రీనివాసరావు, చల్లా పూర్ణ చంద్రశేఖర్, యనమండ్ర కృష్ణమోహన్, రావి మధుసూదనరావు, డీటీపీ ఆపరేటర్లు కుర్రా అనంత లక్ష్మి, మద్దినేని నిర్మల, మండవ రాఘవ, బజుగులు పార్వతి, స్టాంపు వెండర్లు బాచిన శ్రీనివాసరావు, అమరా రామ్మోహనరావు, రావూరి రంగారావు, పెన్‌డౌన్ కార్యక్రమానికి పిలుపునిచ్చిన వారిలో ఉన్నారు.

గర్భిణులకు మెరుగైన సేవలు

కారంచేడు: స్థానిక పీహెచ్‌సీల్లో డెలివరీ అయ్యే వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని కారంచేడు పీహెచ్‌సీ డాక్టర్ కె. జెస్సీరాణి అన్నారు. సోమవారం గర్భిణులు, బాలింతలకు పోషికాహారం, మందులను, సిరప్‌లను అందించారు. హిమోగ్లోబిన్ శాతంను ఎంత ఎక్కువగా ఉంచుకుంటే అంత మంచిదన్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాన్ని కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీహెచ్‌ఎన్ సువర్ణజ్యోతి, హెచ్‌వీలు, వసంతవల్లి, ఎం.వీరమ్మ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్యాస్ క్రిమటోరియంను ప్రారంభించాలి



మేయర్ గంగాడ సుజాతకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: నగరంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద గల శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన గ్యాస్ క్రిమటోరియంను వెంటనే ప్రారంభించాలని ఒంగోలు నగరాభివృద్ధి కమిటీ నాయకులు సోమవారం నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పౌరసంఘాల సమైక్య కన్వీనర్ జి.రమేష్ మాట్లాడుతూ శ్మశానవాటిక వద్ద వాచమెన్‌ను నియమించాలని, శ్మశానవాటికలో ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయాలని, నీటి వసతి కల్పించాలి కోరారు. అనాథ మృతదేహాలను ఉచితంగా దహనం చేయాలని, బాలాజీనగర్, ఇందిరమ్మ గృహాల వద్ద రెండు శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలని నగరాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఓగిరాల రాధాకృష్ణ, ఈదుపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన అంబేడ్కర్ స్టడీ సర్కిల్ నాయకులు



ఎంపీ మాగుంటతో మాట్లాడుతున్న కరవది అంబేడ్కర్ స్టడీ సర్కిల్ నాయకులు

ఒంగోలు రూరల్: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని స్థానిక తన కార్యాలయంలో అంబేడ్కర్ స్టడీ సర్కిల్ కరవది గ్రామ నాయకులు కలిశారు. కరవది రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలు కల్పించాలని వినతిపత్రం అందజేశారు. ఎంపీ సానుకూలంగా స్పందించి రైల్వే అధికారులతో, రైల్వే మంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దేవరపల్లి మధుబాబు, జంగా రాజు, దారా విక్టర్, దేవరపల్లి రామకోటయ్య, దేవరపల్లి ప్రభాకర్‌రావు, సత్యాల శ్రీనివాసరావు, మిడసల కృష్ణ, జంజర రాజేష్, అంచిపోగు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

శిద్దా సుధీర్‌కుమార్‌కు పలువురు అభినందనలు



శిద్దా రాఘవరావు, శిద్దా సుధీర్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు

ఒంగోలు: టీటీడీ పాలకవర్గ సభ్యునిగా నియమితులైన శిద్దా సుధీర్‌కుమార్, ఆయన తండ్రి మాజీ మంత్రి శిద్దా రాఘవరావులను సోమవారం ఒంగోలులోని వారి నివాసంలో జిల్లావ్యాప్తంగా తరలివచ్చిన పలువురు ప్రముఖులు కలిసి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు జలదంకి వెంకట కృష్ణారావు, సోమిశెట్టి సుబ్బారాయుడు, గోళ్ల సుబ్బరత్నం, వాసవీ విద్యా సంస్థల చైర్మన్ విట్టా శ్రీనివాసరావు తదితరులు శిద్దా రాఘవరావు, సుధీర్ కుమార్‌లను గజమాలలతో ఘనంగా సత్కరించారు. ఒంగోలుకు చెందిన రావూరి బుజ్జి నేతృత్వంలో సినీ హీరో ప్రభాస్ ఫ్యాన్స్, ఒంగోలు శివం ఫౌండేషన్ ప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు. చీమకుర్తి హరిహరక్షేత్రం ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు అందించారు. దొనకొండ, ముండ్లమూరు, దర్శి, కురిచేడు, చీమకుర్తికి చెందిన పలువురు నాయకులు, అధికారులు, ఆధ్యాత్మిక వేత్తలు, గ్రానైట్ రంగ వ్యాపారులు శిద్దా సుధీర్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

రైతాంగాన్ని పట్టించుకోని మోదీ సర్కార్

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



సమావేశంలో ప్రసంగిస్తున్న రామకృష్ణ

ఒంగోలు టౌన్: దేశంలోని రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని కేంద్రంలో అధికారంలోకి వచ్చిన పీఎం నరేంద్రమోదీ ప్రభుత్వం రైతుల ఆత్మహత్యలను నివారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. బస్సు యాత్రలో భాగంగా సోమవారం ఆయన ఒంగోలు చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మల్లయ్య లింగం భవనంలో రైతాంగ సమస్యలపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. గత 9 ఏళ్లలో దేశంలో నాలుగు లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. అయినా సరే బీజేపీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని మండిపడ్డారు. సారవంతమైన భూమి ఉండి పుష్కలంగా నీరు లభించే ప్రాంతాలలోనే వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో బీజేపీ ప్రభుత్వంలో వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతిందని చెప్పారు. ప్రభుత్వాలు స్వామినాథన్ సిఫార్సులు అమలు చేసి ఉంటే నేడు అలాంటి పరిస్థితి నెలకొనేది కాదన్నారు. చట్ట సభల్లో రైతాంగ సమస్యలపై ప్రజాప్రతినిధులు, పాలకులు నోరువిప్పి మాట్లాడినప్పుడే పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. దేశంలోని ఏ రాజకీయ పార్టీకీ బీజేపీ మతతత్వ రాజకీయాలపట్ల ప్రేమ లేదని, అన్ని విధాలుగా విఫలం చెందిన మోదీ పాలనను ప్రతిఒక్కరూ వ్యతిరేకిస్తున్నారని స్పష్టం చేశారు. దేశానికి అన్నం పెట్టే రైతు కళ్లలో సంతోషం కనిపించినప్పుడే దేశం బాగుంటుందన్నారు. ప్రతి ఏడాది దేశవ్యాప్తంగా కార్పొరేట్లు, బడా వ్యాపారులు 2 లక్షల కోట్ల రూపాయల రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారని, కార్పొరేట్ శక్తులకు, బడా వ్యాపారవేత్తలకు కేంద్ర ప్రభుత్వం 2.58 లక్షల కోట్ల రూపాయల రాయితీలు ఇస్తోందని చెప్పారు. రైతులకు సంబంధించి 4.50 లక్షల కోట్ల రూపాయల రుణాలను మాత్రం మాఫీ చేయడానికి మనసు రావడంలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం మరింత ఉధృతం చేస్తామన్నారు. రాజకీయపార్టీలకు అతీతంగా రైతులు రోడ్లమీదకు వచ్చి పాలకులను నిలదీయాలని రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఎస్.కోటిరెడ్డి పిలుపునిచ్చారు. దేశంలో కేవలం రైతు కూలీలు మాత్రమే ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారో ప్రభుత్వాలు ఆలోచించాలన్నారు. కౌలు రైతుల పరిస్థితి దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు మోసపూరితమని ఆచార్య రంగా కిసాన్ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య విమర్శించారు. సమావేశానికి కేవీవీ ప్రసాద్ అధ్యక్షత వహించగా నేతి మహేశ్వరరావు, దేవరపల్లి సుబ్బారెడ్డి, ఎంఎల్ నారాయణ, ఆర్.వెంకటరావు, లెనిన్‌బాబు, జయలక్ష్మి, పీవీఆర్ చౌదరి, కె.వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్‌లో ఉచిత శిక్షణ

చీమకుర్తి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని మహిళలకు 3 నెలల పాటు ఉచితంగా కంప్యూటర్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతనూతలపాడులోని ఎండ్లూరు డొంక వద్ద మహిళా ప్రాంగణంలో శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి గల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 99630 05209 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.